www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 19 జులై 2024

5



కాటన్ బ్యారేజ్ వద్ద 10 అడుగుల నీటి మట్టం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలనేపథ్యంలో గోదావరి నీటి మట్టం స్వల్పం గా పెరిగింది. మూడు రోజులుగా నిలకడగా ఉన్న నీటిమట్టం గురువారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 10 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 1.53లక్షల క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 1.43లక్షల క్యూసెక్కులు ఉంది. పంట కాలువలు ద్వారా 8,700క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ (8977935609), రాజమండ్రి ఆర్‌డిఒ కార్యాలయం (0883 2442344), కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం(08812 231488) విద్యుత్తు ఫిర్యాదుల కేంద్రం కంట్రోల్ రూం(1902)లను ఏర్పాటు చేశారు.

ఎడతెరపిలేని వాన

- జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- కాటన్ బ్యారేజీ వద్ద 10 అడుగుల నీటిమట్టం

జిల్లావ్యాప్తంగా గురువారం విస్తారమైన వర్షాలు కురిశాయి. జనజీవనం అస్తవ్యస్తమయ్యింది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, యంత్రాంగం

గోదావరికి వరద నీరు చేరుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు రాష్ట్రంలోనూ వర్షాలు తోడవటంతో క్రమ క్రమంగా తీవ్రత పెరుగుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రం 6 గంటలకు 21.80 అడుగుల నీటిమట్టం నమోదయ్యింది. భారీ వర్షాల నేపథ్యంలో తూర్పుగోదావరి, కోనసీమలోని పరివాహక ప్రాంతాల్లో డేంజర్‌బెల్స్ మోగుతున్నాయి. భద్రాచలం నుంచి వస్తున్న ప్రవాహాన్ని అంచనా వేసుకుని ఇక్కడి జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. సాయంత్రం 6 గంటలకు సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద 10.00 అడుగుల నీటిమట్టం నమోదయ్యింది. 1.53 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో 1.43 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోనికి విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 8700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని పాత బ్రిడ్జి వద్ద 11 మీటర్ల నీటి మట్టం ఉంది. రాబోయే 24 గంటల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

కోనసీమలో డేంజర్ బెల్స్

గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరగడంతో కోనసీమలోని నదీ పరివాహక ప్రాంతాల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా ఎగువ రాష్ట్రాల్లో వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమవుతున్నారు. అయినవిల్లి మండలంలోని కోటిపల్లి, అయినవిల్లి లంక, పి.గన్నవరం మండలంలోని గంటి పెదపూడి ఫెర్రీ, ఊడుమూడి లంక, బూరుగులంక, అరిగెలవారిపేట, మామిడికుదురు మండలంలో అప్పనపల్లి, పాశర్లపూడి గ్రామాల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. అధికార యంత్రాంగం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాటన్ బ్యారేజీ వద్ద 11.75 అడుగుల ఎత్తున నీటిమట్టం చేరితే దిగువకు 10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. మొదటి ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో అధికారుల గణాంకాల ప్రకారం కోనసీమ జిల్లాల్లో 7 గ్రామాలు ముంపునకు గురవుతాయి. 13.75 అడుగులకు చేరితే 13 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఫలితంగా 13 గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. అదే బ్యారేజీ వద్ద 17.75 అడుగులకు నీటిమట్టం చేరితే 17 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. దీంతో 12 గ్రామాలపై ప్రభావం ఉంటుంది. పలు కాజ్‌వేలు ముంపునకు గురవటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయి. తూర్పు గోదావరిలో సీతానగరం, కొవ్వూరులో గోదావరి గట్లతో పాటు, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నాగుల్లంక, తొండవరం, వాకలగరువు గట్లు బలహీనంగా ఉన్నాయి. దీంతో పరివాహక ప్రాంత ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పట్టణాల్లోని పలు ప్రధాన కూడళ్లు జలమయం అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల పలు భూములు ముంపునకు గురయ్యాయి. తూర్పు గోదావరి జిల్లాలో సగటు 67.1 ఎంఎం వర్షపాతం నమోదైంది. దేవరపల్లి మండలంలో అత్యధికంగా 124.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. గోకవరం మండలంలో అత్యల్పంగా 21.2 ఎంఎం వర్షపాతం నమోదైంది.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

అధిక వర్షాలు, వరదల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా, డివిజన్ స్థాయి 24 గంటలూ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులతో సమీక్షించారు. ప్రతి శాఖా వారికీ నిర్దేశించిన ప్రోటోకాల్ మేరకు ముందస్తు కార్యచరణతో సంసిద్ధంగా ఉండాలన్నారు. గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది పర్యటించి బలహీనంగా ఉన్నట్లుగా గుర్తించి, వాటిని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రహదారులను, బలహీనంగా ఉన్న కాజ్ వేలు, పాత వంతెనలు, లోతట్టు ప్రదేశాలను, ముంపునకు గురయ్యే ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయిలో మెడికల్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొవ్వూరు, సీతానగరం, రాజమండ్రి రూరల్ అర్బన్ ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న లంక గ్రామాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, హెచ్చరికను దృష్టిలో పెట్టుకొని పునరావాస కేంద్రాలకు తరలించే విధానంలో సన్నద్ధంగా ఉండడం, ప్రజలకి అవగాహన కల్పించాలన్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించి భవనాలు తనిఖీ చేయాలన్నారు. పాత భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్న తగరతి విద్యార్థులను పక్క భవనాల్లో క్లాసులు నిర్వహించాలని ఆదేశించారు. **ఆత్రేయపురం:** భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. **ఆలమూరు:** భారీ వర్షాలకు వరి చేలు వర్షాలకు నీటిలో మునిగాయి. **కొత్తపేట:** భారీ వర్షాల కు రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామంలో రోడ్లు, రావుల పాలెం ఆర్‌టిసి బస్టాండ్ జలమయంఅయ్యాయి. మండలంలో కొత్తపేట శివారు కండ్రిగ మెయిన్‌రోడ్ వద్ద భారీవృక్షం నేలకొరిగింది.


గంటి పెదపూడిలంక పై వరద ఉధృతికి పడిన గండి

లంక గ్రామాల రహదారికి గండి

పి.గన్నవరం: భారీ వర్షాలకు గోదావరిలో వరద నీరు పోటెత్తుతుంది. దీంతో పి.గన్నవరం మండలం వశిష్ఠ గోదావరిపాయపై గంటి పెదపూడి లంక వద్ద ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారికి గురువారం గండి పడింది. రహదారికి గండిపడడంతో గోదావరి మధ్యలో ఉన్న జి.పెదపూడిలంక, ఊడిమూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక, వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.. 2022 వరదల్లో ఇదే రహదారికి గండి పడిన మూడు మాసాల వరకు 5 లంక గ్రామాల్లో అవస్థలు పడుతుండగా అప్పటి సిఎం వైఎస్.జగన్ ఆ ప్రాంతాలను సందర్శించారు. వారి ఇబ్బందులను తెలుసుకొని, ఇక్కడ వంతెన నిర్మిస్తామని 2023నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదు. దీంతో ఆ ప్రాంత వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వరదల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు.

'కోటిపల్లి' రైల్వేలైన్ భూ సేకరణ ప్రక్రియపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు రైల్వే రెవెన్యూ అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సమావేశం నిర్వహించి కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ భూ సేకరణ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ పూర్తయితే నేరుగా కాకినాడ నుంచి విజయవాడ చేరుకునేందుకు ప్రత్యామ్నాయ ఎలక్ట్రిఫైడ్ రైలు మార్గం ఏర్పడుతుందన్నారు. అమలాపురం- నరసాపురం రైల్వే లైన్ నిర్మా ణం కొరకు భూసేకరణ సర్వేను రైల్వే ,రెవిన్యూ అధికారులు సంయుక్తంగా ప్రణాళిక బద్ధంగా జాప్యాలకు తావు లేకుండా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రైల్వే లైన్ భూసేకరణ ప్రక్రియలో ఉత్పన్నమవుతున్న సమస్యలను జిల్లా కలెక్టర్ స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి, సంబంధిత తహశీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రైల్వే అధికారులు కూడా పలు సమస్య లను కలెక్టర్ దష్టికి తెచ్చారు. ఇప్పటివరకు కోటిపల్లి- అమలాపురం భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని రెవెన్యూ రికార్డులను మ్యూటేషన్ ప్రక్రియ చేయాలని రైల్వే అధికారులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. అమలాపురం నరసాపురం రైల్వే లైన్ కొరకు భూసేకరణ సర్వే చేయాల్సిందని రైల్వే అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కొన్నిచోట్ల భూ స్వాముల నుంచి అభ్యంతరాలు వస్తున్నట్లు వారు కలెక్టర్ దష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా జెసి ఎస్ నుపూ ర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, రైల్వే శాఖ డిప్యూ టీ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, రైల్వే ఏయాక్స్ ఇ ఎన్ రామలింగరాజు, స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి జి.కేశవర్ధన రెడ్డి, తహశీల్దార్లు , డిప్యూటీ తహశీల్దార్ చిన్నబాబు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

కుష్టు నిర్మూలనపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-అమలాపురం

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనకార్యక్రమాలపై వైద్య సిబ్బందితో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్థాయి లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా కుష్టు నిర్మూలనపై అవగాహన పెంచాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 18 వ తేదీ గురువారం నుంచి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తిం చేందుకు ఆగస్టు 2 తేదీ వరకు ప్రభుత్వం సర్వే చేపట్టిందని ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించి తదుపరి చికిత్సలు అంది స్తారన్నారు. దీని కోసం జిల్లా వ్యాప్తంగా 1422 బందాలను ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్‌వి.భరత లక్ష్మి, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమలత, జిల్లా వైద్య సేవలు సమన్వయ అధికారి డాక్టర్ కార్తీక్ రెడ్డి, డిఐఒ సత్యనారాయణ, స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కుష్టు నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

అంబాజీపేట: జిల్లాను కుష్టు వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు భాగంగా ఈ నెల 18 నుంచి అగస్టు2 వరకూ కుష్టునిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి వి.గౌతమి తెలిపారు.ఈ సందర్భంగా అంబాజీపేట పిహెచ్‌సి వద్ద గురువారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా సర్వే ద్వారా కుష్టు వ్యాధి గుర్తింపు పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ అప్పారావు పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎం లు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.


అంబాజీపేటలోపోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఐ.పోలవరం మండల పరిధిలో గుత్తెనదీవి 33 కెవి సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం, ట్రీ కట్టింగ్ చేస్తున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకారవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు మురమళ్ల, కొమరగిరి, పాతఇంజరం, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, గోగుల్లంక, రామాలయం పేట,కరవాకు లంక, మగసాని తిప్ప తదితర గ్రామాలకు సరఫరా నిలిపివేస్తారన్నారు.

కరాటే పోటీలకు ఆశ్రం స్కూల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఆలమూరు

హైదరాబాద్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కరాటే టైక్వాండో కుంగ్ ఫు పోటీలకు మండపేట ఆశ్రమ్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, స్కూల్ ప్రిన్సిపల్ ఎండ్రు శ్రీసాయి వీర వెంకట అవినాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ వెయిట్ కేటగిరి 32 కేజీల విభాగంలో తరుణ్ ప్రకాశ్ రెడ్డి, 34 కేజీల విభాగంలో షేక్ లాల్ సాహిధ్, 36 కేజీల విభాగంలో కోణాల తేజ రెడ్డి, జూనియర్స్ గర్ల్స్ 40కేజీల విభాగంలో తేతల నేహశ్రీ రెడ్డి, సీనియర్స్ 60 కేజీల విభాగంలో ద్వారంపూడి జాగతి, షేక్ ఖలీద్ హుస్సేన్ లు ఉన్నారు. కార్యక్రమంలో ఎండ్రు శ్రీభాస్కర పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

అమలాపురం 2వ అదనపు న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ అధ్యక్షులు వి.నరేష్

ప్రజాశక్తి-అమలాపురం

రహదారి భద్రత పట్ల ప్రతి ఒక్కరు పూర్తి అవగాహన కలిగి ఉండాలనిఅమలాపురం రెండవ అదనపు న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ అధ్యక్షులు వి నరేష్ పేర్కొన్నారు . గురువారం స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి గడియార సెంటర్ వరకు రహదారి భద్రత పట్ల అవగాహన పెంపొందించేందుకు ర్యాలీ నిర్వహించారు. రెండవ అదనపు న్యాయమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ అవగాహన ర్యాలీలను నిర్వహిస్తున్నారన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లేకుండా ప్రయా ణించేటప్పుడు తనంతట తానే వాహనం మీద నుండి జారిపడిన ప్రమాదం పొంచి ఉంటుందని అదే విధంగా ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న ప్రయాణికులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పోలీస్ యంత్రాంగం కూడా రద్దీ కూడళ్ల వద్ద భద్రత పరమైన చర్యలు పటిష్టం చేయాలని ఆయన సూచించారు. కారులో ప్రయాణించేవారు డ్రైవర్ తో పాటుగా అందరూ సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన స్పష్టం చేశారు. రహదారిపై ప్రమాదాలు సంభ వించినప్పుడు నాకెందుకులే అని వెళ్ళిపోకుండా రహదారి ప్రమాద బాధితులను రక్షించడంలో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్షణ పరంగా చర్యలు తీసుకోవాలని అందుకు రూ.10వేలు వరకు పారితోషకం పొందవచ్చునని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో డివిజనల్ రెవెన్యూ అధికారి జి.కేశవర్ధనరెడ్డి, పోలీస్ ఉన్నతా ధికారులు రవాణా శాఖ అధికారులు న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీరిన సాయిరాం, మాజీ అధ్యక్షులు అడపా వెంకట సత్యప్రసాద్, మాకిరెడ్డి ఆదినారాయణ, సెక్రటరీ నందిక శ్రీనివాస్, న్యాయ వాదుల కోర్టు సిబ్బంది, విద్యార్థులు, ఆటో రిక్షా డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.


అమలాపురంలో అవగాహనా ర్యాలీ

రామచంద్రపురం పట్టణంలో

రామచంద్రపురం గురువారం రామచంద్రాపురం మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సబ్ కోర్టు ప్రాంగణం నుండి ప్రారం భమైన ర్యాలీ పట్టణంలోని మెయిన్ రోడ్డు మీదుగా కొనసాగింది. న్యాయవాదులు, పోలీసు సిబ్బంది హెల్మెట్లు ధరించి మోటారు సైకిల్ తో ర్యాలీలో పాల్గొన్నారు . సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వ రరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి మురళీమోహన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో అవగాహనా ర్యాలీ

విద్యాభివృద్ధికి కృషి : ఎంఎల్‌ఎ బండారు

ప్రజాశక్తి-కొత్తపేట

విద్యాభివృద్ధికి తన సాయశక్తులా కృషి చేస్తామని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట, రావుల పాలెం ప్రభుత్వం పాఠశాల్లో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను పెంపొందించడం కోసం కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ కసరత్తులు చేస్తుందని అందుకోసం ఆ శాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి, భాస్కరరావు, త్సామా బాబు, మర్గాని గంగాధర్, ఆకుల రామకృష్ణ, కెవి.సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాల పంపిణీలో పాల్గొన్న ఎంఎల్ బండారు సత్యానందరావు

గ్రామాభివృద్ధికి కృషి : ఎంఎల్‌ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు కోరిమిల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఆయన ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం నిమిత్తం గ్రామానికి వచ్చిన ఎంఎల్‌ఎ వేగుళ్ళకు గ్రామంలో వోల్టేజ్ సమస్యను తీసుకువెళ్లగా హామీ మేరకు నూతన ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసి ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఇఇ వై.విజయనంద్, డిప్యూటీ ఇఇ మురళీమోహన్, ఎఇ ఎన్ఎస్.రావు, ఎంపిటిసి సభ్యులు సుంకల వెంకటేశ్వరరావు తదితరులు, పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బలరాం మాట్లాడుతూ. కేంద్ర బిజెపి ప్రభుత్వం అదాని, అంబానీలకు మేలు చేస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందన్నాయరు. మరోవైపు పేదలకు వ్యవసాయ కార్మికులకు రోజువారి కూలీలకు అన్యాయం చేస్తోందన్నారు. సిపిఎం ఆశయాలు, సిద్ధాంతం కోసం పనిచేయాలన్నారు. కార్యకర్తలు అంటేనే సమాజంలో ఎంతో గౌరవం ప్రత్యేక స్థానం లభిస్తుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు, పేదలు, రైతు కూలీలు పక్షాన నిలబడే పార్టీ సిపిఎం అని ఆయన అన్నారు. శిక్షణ తరగతులకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్ ప్రిన్సిపల్ గా వ్యవహరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.బలరాం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బలరాం


మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ శివశంకర్

డ్రోన్ వినియోగంపై శిక్షణ

ప్రజాశక్తి-ముమ్మిడివరంరూరల్

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల డిఆర్‌డిఎ జిల్లా కార్యాలయంలో గురువారం డ్వాక్రా మహిళలకు డ్రోన్ వినియోగం పై ఒక రోజు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.వి.శివశంకర్ ప్రసాద్ మట్లాడుతూ ప్రభుత్వాలు డ్వాక్రా మహిళలను ఆర్థికంగా పరిపుష్టి చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని పేర్కొన్నారు. హైదరాబాదు జాతీయ నైపుణ్యాభివద్ధి సంస్థ ఆపరేటర్లు రాకేష్ సతీష్ లు మహిళలకు డ్రోన్ ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. విజయవాడ ఎన్ఎస్ డిసి నుండి విచ్చేసిన చంద్రమౌళి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి ఎంఎం.జిలాని, డిపిఎం విజయ్‌కుమార్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి పి.లోకమాన్, బైర్రాజు ఫౌండేషన్ ప్రతినిధి రామకష్ణ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగరువు గ్రామంలో ఈ నెల 26,27 తేదీల్లో ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ నక్క అరుణకుమారి చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న పంచాయతీ కార్యాలయం, 27న సచివాలయం 2 లోను ఆధార్ క్యాంప్ నిర్వహిస్తారని అని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


తనపై వస్తున్న కథనాల్లో నిజం లేదు

రాజ్యసభ ఎంపీ బోస్

ప్రజాశక్తి-రామచంద్రపురం

కొన్ని మాధ్యమాల్లో తనపై వచ్చిన తప్పుడు కథనాలకు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ స్పందించారు. ఈ మేరకు తన కార్యాలయంలో గురువారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని మాధ్యమాల్లో తనపై తప్పుడు కథనాలు ప్రచురించారని మండిపడ్డారు. నేను ఎప్పటికీ వైఎస్ఆర్ కుటుంబానికి విధేయుడి గానే ఉంటానని అన్నారు. నా రాజకీయ జీవితం అంతా జగన్ తోనే అని తేల్చి చెప్పారు. ఆర్థికంగా నేను పేదవాడినే కానీ, లాయల్టీలో నేను అధిక సంపన్నుడిని అని ప్రలోభాలకు లొంగేవాడ్ని కాదన్నారు. తాను టిడిపిలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదన్నారు.

కార్టూ'నిజం'



బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం

ప్రజాశక్తి-అమలాపురం

బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ధూమపానం నేరమనిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జాన్ లేవి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ఆధ్వర్యంలో స్టేట్ లీగల్ కన్సల్టెంట్, పోలీస్ లేబర్, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాన్ లేవి మాట్లాడుతూ స్కూల్లు కాలేజ్ ప్రభుత్వ ఆఫీసుల్లో చట్టప్రకారం 100 మీటర్ల దూరంలో షాపులు ఎటువంటి పొగాకు ఉత్పత్తులు అమ్మరాదన్నారు. అలా విక్రయిస్తే చట్టపరంగా జరిమానం జైలు శిక్ష విధిస్తారన్నారు. .రాష్ట్ర ఆరోగ్యశాఖ హెల్ప్ లైన్ నెంబర్ 1800-425-2024. ఈ ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న స్టేట్ లీగల్ కన్సల్టెంట్ పి శివశంకర్, పోలీస్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ సాయి స్వరూప్, ఎస్ఐ చంటి, అకౌంట్ ఆఫీసర్ జి.వెంకట శ్రీను, సోషల్ వర్కర్ ప్రమీల, ఎన్‌సిడి సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాలు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

'టీచ్ టూల్' పై 9 రోజుల శిక్షణ

డిప్యూటీ కలెక్టర్ సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు

ప్రజాశక్తి-అమలాపురం

మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయుల వత్తి నైపుణ్యాలను అభివద్ధి పర్చేందుకు, టీచ్ టూల్ ద్వారా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అధ్యయనం చేసేందుకు 9 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ సమగ్ర శిక్ష అదనప ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదన రావు తెలిపారు. అమలాపురం జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రయినింగ్, సమగ్ర శిక్ష ఎపి సంయుక్త ఆధ్వర్యంలో టీచ్ టూల్ పేరుతో అమలాపురం డివిజన్లోని సిఆర్‌పిలు, హైస్కూల్ హెచ్ఎంలు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్లు, సిఆర్ఎంటీలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మదుసూధనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయుల వత్తి నైపుణ్యాలను అభివద్ధి పర్చేందుకు అదే సమయంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఎన్‌సిఇఆర్‌టిపలు రకాల పద్ధతులను అధ్యయనం చేస్తోందన్నారు. ఎఎంఒ పి.రాంబాబు, సిఎంఒ బివివి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గుణాత్మక విద్యను అభివృద్ధి చేసేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. అమలాపురం మండలం పేరూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన టీచ్ టూల్ అబ్జర్వర్ శిక్షణ కార్యక్రమాన్ని అమలాపురం డివైఇఒ గుబ్బల సూర్యప్రకాశరావు ప్రారంభించారు. కార్యక్రమంలో అంబాజీపేట ఎంఇఒ కె.వెంకటేశ్వరరావు, మామిడికుదురు ఎంఇఒ లక్ష్మీనారాయణ, అమలాపురం ఎంఇఒ-2 ఎస్.దుర్గాదేవి పాఠశాల హెచ్ఎం ఎం.పురుషోత్తమ రాజు, అమలాపురం డివిజన్ పరిధిలోని రాజోలు, సకినేటిపల్లి, మామిడికుదురు, మలికిపురం, అమలాపురం, కొత్తపేట, ఐ.పోలవరం, అయినవిల్లి, కాట్రేనికోన అల్లవరం తదితర మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనరావు

ప్రజా వేదిక ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఈనెల 15న ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఈ నెల 15న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై డ్వామా ఏపీడీ డి.రాంబాబు గురువారం విచారణ చేపట్టారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉప్పలగుప్తం-2 ఎంపిటిసి తాళ్ల లక్ష్మీనరసాయమ్మ తమ గ్రామంలోని పెద్దూరు శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోలేదని ఫిర్యాదు చేశారు. శ్మశాన వాటిక పల్లంగా ఉండడంతో ఉపాధి హామీ చట్టంలో శ్మశాన వాటికను మెరక చేయడంతో పాటు విశ్రాంతి భవనం ప్రహరీ నిర్మించాలంటూ కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు.ఈ విషయమై ఎంపిడిఒ కార్యాలయంలో ఏపీడీ రాంబాబు సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఎంపిడిఒ కె.వి.ప్రసాద్, ఉపాధి ఎపిఒ, వి.రాజామణి, ఇఒపిఆర్‌డి కెఎస్.గౌరీ కుమారి, పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కె.అరుణ కుమారి ల సమక్షంలో ఫిర్యాదుదారురాలు ఎంపిటిసి లక్ష్మీనరసాయమ్మ తో విచారణ జరిపారు. శ్మశాన వాటికలో చేపట్టవలసిన అభివద్ధి పనులను ఎంపిటిసి లక్ష్మీనరసాయమ్మ వివరించారు. విచారణ అనంతరం శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు ఏపీడీ రాంబాబు ప్రణాళిక సిద్ధం చేశారు. అనంతరం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించి ఉపాధి కూలీలకు సమన్యాయం చేయాలని అర్హులైన ప్రతి ఒక్కరికి వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. మండలంలో 2,73,826 పని దినాలు కల్పించి జిల్లాలోని 22 మండలాల్లో ఉప్పలగుప్తం మండలం ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని ఏపీడీ రాంబాబు అన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి, శంఖవరం

శంఖవరంలో గురువారం విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కోన లోవకుమార్(35) ఎప్పటిలానే మేకలకు మేత నిమిత్తం పచ్చిరొట్టను తెచ్చేందుకు వెళ్లాడు. సమీపంలోని పామాయిల్ తోటలో రొట్టను కోస్తున్నాడు. ఈ సమయంలో పామాయిల్ మట్ట తెగి విద్యుత్ తీగలపై పడింది. అదుపుతప్పి లోవకుమార్ కత్తి విద్యుత్‌తీగలను తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లోవకుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని టిడిపి నాయకులు పర్వత సురేష్ పరామర్శించారు. ఎంఎల్‌ఎతో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బొర్రా వాసు, జట్లా శ్రీను, రౌతు శ్రీను, కె.కృష్ణారావు, కె.సత్తిబాబు, ఎస్.సత్తిబాబు, కోన కొండబాబు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామం కెనాల్ రోడ్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని జి.మేడపాడుకు చెందిన గోనుపూడి రాజు(29) మతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సామర్లకోటలో బ్యాంకు పని నిమిత్తం జి.మేడపాడుకు చెందిన రాజు ఇద్దరు మహిళలతో స్కూటీపై గురువారం వచ్చాడు. అనంతరం జి.మేడపాడుకు తిరుగుపయనమయ్యారు. కెనాల్‌రోడ్డుపైకి వచ్చే సరికి వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వారిని 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

తాళ్లరేవు : బాలలు, మహిళల చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎస్‌బి.మాణిక్యాంబ అన్నారు. ఇంజరంలో గురువారం బాలల, మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు, బాలల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠినంగా శిక్షించేలా చట్టాలున్నాయన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కోట శ్రీధర్, అంగన్‌వాడీలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నారుమళ్లకు రక్షణ

కాజులూరు : వెదజల్లే విధానంలో జాగ్రత్తలు పాటిస్తే వర్షాల నుంచి నారుమడి ని రక్షించుకోవచ్చని ఎఒ ఎ.అశోక్ తెలిపారు. గురువారం కాజులూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. కొద్దిరోజులగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల వరిపంట నష్టాలకు గురైందన్నారు. వీలైనంత తొందరగా నారుమళ్లలో నీటిని పూర్తిగా బయటకు తీసివేయడం వల్ల నష్టం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

కరప : జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు గురువారం నుంచి ప్రారంభమైంది. కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ ఈ కార్యక్రమాన్ని గొడారిగుంట ఎంఎల్‌ఎ కార్యాలయంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రూరల్ నియోజకవర్గాన్ని అగ్ర స్థానంలో నిలపాలని కోరారు. సభ్యత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. నమోదులో ఏవైనా ఇబ్బందులుంటే హెల్ప్ లైన్ లేదా కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు.

పేదరికం లేని గ్రామాల సాధనకు కృషి

సామర్లకోట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల ద్వారా రాష్ట్రంలో పేదరికం లేని గ్రామాలను సాధించేందుకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక మోడల్ ప్లాన్‌ల తయారీ ద్వారా కృషి చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో పూర్వపు ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి 11 జిల్లాల జిల్లా స్థాయి అధికారులకు థీమ్-1పై బ్యాచ్‌ల వారీ మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేణుగో పాల్ మాట్లాడారు. ఈ శిక్షణలో 11 జిల్లాలకు చెందిన జెడ్‌పి సిఇఒలు, డిఆర్‌డిఎ పీడీలు, డిఎల్‌పిఒలు, డిపిఒలు, డ్వామీ పీడీలు, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జివి.శ్రీదేవి, పి.శ్రీనివాస రావు, వి.ప్రసాద్ తదితరులు వారికి శిక్షణ నిచ్చారు.

తణుకురాజుకు ఘన నివాళి

తాళ్ళరేవు : ఇటీవల మృతి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మందనక్క తణుకు రాజుకు ప్రజా సంఘాల నాయ కులు ఘనంగా నివాళు లర్పించారు. గురువారం తణుకు రాజు దినకార్యం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, తదితరులు తణుకురాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, బీర వెంకటేశ్వర్లు, దుప్పి అదృష్టదీపుడు, విప్పర్తి శ్రీనివాస్, పులపకూర కృష్ణ, గోడి భాస్కరరావు, పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

కాకినాడ రూరల్ : కొండయ్యపాలెం శారదా దేవి గుడికి వెళ్లే నాలుగు రోడ్ల జంక్షన్‌లో శ్రీకష్ణ దేవరాయల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాపు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పేర్కొన్నారు. ఈ మేరకు వాసిరెడ్డి దాసు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ పంతం నానాజీకి గురువారం వినతిపత్రం అందించారు. దీనిపై నానాజీ సానుకూలంగా స్పందించారు. విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రంగా మిత్ర మండలి సభ్యులు, ఆంధ్ర కాపు సద్భావన సంఘ సభ్యులు, శ్రీకష్ణదేవరాయల అభిమానులు పాల్గొన్నారు.

రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కరప

రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ కోటేశ్వరరావుకు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌లకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌలు రైతు సంఘాల పోరాట ఫలితంగా వచ్చిన కౌలు చట్టాన్ని గత వైసిపి ప్రభుత్వం మార్చి వేసిందన్నారు. దీంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రాక, బ్యాంకు రుణాలు అందక అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. టిడిపి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దుచేసి ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డు ఇచ్చి, బ్యాంకు రుణాలు అందించాలన్నారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలను వెంటనే అందించాలన్నారు. మే, జూన్ నెలలో చేసిన ఉపాధి హామీ కూలీలకు వెంటనే బకాయి కూలి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చోడిశెట్టి కృష్ణ, కౌలు రైతు సంఘ నాయకులు వాసంశెట్టి అప్పారావు, ఎస్.గణపతి, వై.కృష్ణ, పి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు

అటానామస్‌గా పైడా ఇంజినీరింగ్ కళాశాల

ప్రజాశక్తి - తాళ్లరేవు

పైడా ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చినట్లు పైడా గ్రూపు విద్యాసంస్థల ఛైర్మన్ పైడా సత్యప్రసాద్, ఎండి, సెక్రటరీ పైడా సత్యశ్రీరామ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి 2033-34 వరకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీచే అటానమస్ స్టేటస్ (స్వయంప్రతిపత్తి గల సంస్థ)గా నిర్ధారిస్తూ ఈ నెల 17వ తేదీన ధ్రువీకరణ పత్రం జారీ చేశారని అన్నారు. కళాశాల అభ్యున్నతికి సహకరించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి యాజమాన్యం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. 1953లో ద్రాక్షరామంలో ఉన్నత పాఠశాలగా తమ పూర్వీకులు ప్రారంభించిన విద్యా సంస్థ నేడు 4 వేలకుపైగా విద్యార్థులు, 30కి పైగా కోర్సులు, కాకినాడ, పటవల, ద్రాక్షారామంలలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. రెండు నెలల క్రితం ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ కళాశాలలు రెండిటికీ నేషనల్ అక్రిడిటేషన్ అండ్ అసెస్మెంట్ కౌన్సిల్ న్యూఢిల్లీ చే 'ఏ గ్రేడ్ ' మంజూర య్యిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే స్వయంప్రతిపత్తి గుర్తింపును మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

కుష్టు నిర్మూలనకు చర్యలు

కాకినాడ : జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో కుష్టువ్యాధి నిర్మూలన చర్యలకు సంబంధించి వివిధ శాఖలతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి వ్యాప్తికి కారణాలను గుర్తించి, వాటిని నివారించాలన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని చాలావరకు అరికట్టొచ్చన్నారు. ఈ సమావేశంలో 3వ అడిషనల్ జిల్లా జడ్జి పి.కమలాదేవి, జెసి ఎస్.రామసుందర్‌రెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, జిల్లా పౌరసంబంధాల అధికారి డి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రసాబాసగా పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి సచివాలయంలో గురువారం జరిగిన పంచాయతీ సమావేశం రసాబాసగా మారింది. పంచాయతీ కార్యదర్శి డిఎస్ఎన్.రెడ్డి సర్పంచ్ రత్తుల లలిత ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. తొలుత ఏడుగురు వార్డు సభ్యులు మాత్రమే వచ్చారు. తీర్మానాలకు సంబంధించిన మాట్లాడకుండానే సమావేశాన్ని ముగించేశారు. అనంతరం మరి కొంతమంది వార్డు సభ్యులు వచ్చారు. అప్పటికే సమావేశాన్ని ముగించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ వార్డు సభ్యులు సమావేశానికి మినిట్స బుక్స్‌లో సంతకాలు చేసి వ్యక్తిగత పనులపై వెళ్లిపోయారని తెలిపారు. తాము రాకుండానే సమావేశాన్ని ముగించడంపై టిడిపి సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆయన స్పందించి సర్పంచ్‌కు ఫోన్ చేశారు. వ్యక్తిగత పనుల వల్ల రాలేనని చెప్పారు. మరోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నేటి సమావేశంలో ఎలాంటి తీర్మానం జరుగలేదని తెలిపారు. దీనిపై టిడిపి నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై నిలదీస్తామని తెలుసుకుని ముందుగా వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోయారన్నారు. ఇది సరైన మద్దతి కాదని ఎలమాటి కాశీ అన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

తాళ్లరేవు : ఎడతెరిపిలేని వర్షం వల్ల జలమయమైన పల్లపు ప్రాంతాలను ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుంకరపాలెం బైపాస్ లో కూడలిలో మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని టిడిపి నాయకులు మోపూరి వెంకటేశ్వరరావు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. వ్యాపార సముదాయాలు వద్ద నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. సుంకరపాలెం జంక్షన్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ప్రధాన రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆర్ అండ్‌బి డిఇ ఎన్‌హెచ్ 216 అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న భాస్కరరాజు, చీకట్ల నాగేశ్వరరావు, సుంకర చంద్రం, వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జిజిహెచ్ రిటైర్డ్ ఎంఎన్ఒ మృతికి సంతాపం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిజిహెచ్ రిటైర్డ్ ఎంఎన్ఒ భూపతి అప్పారావు మృతికి సిఐటియు, ఇతర ప్రజా సంఘాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, సహాయ కన్వీనర్ పలివెల వీరబాబు, జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్. విజయ్‌కుమార్, జె.శేషు, జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు వై.శంకర్, ఏడుకొండలు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిజిహెచ్ బ్రాంచ్ నాయకులు డి.పుష్పరాగం, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బంగారు సత్తిబాబు టాటా మ్యాజిక్ వాహన డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు వాలిశెట్టి శ్రీనివాస్ సంతాపం ప్రకటించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

మండలానికి చెందిన దివిలి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనిఎపి ఇపిడిసిఎల్ పెద్దాపురం ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చదలాడ, ఉలిమేశ్వరం, కాంద్రకోట, గుడివాడ, సిరివాడ, మరలావ, తూర్పుపాకలు, తిరుపతి, తాటిపర్తి, దివిలి, పులిమేరు, గోరింట, చంద్రమాంపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సామర్లకోట రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కెవి పవర ఫీడర్ మర్మమతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం.1.00 గంట వరకు ఉండూరు, గొంచాల, నవర, పవర, పి వేమవరం, కాపవరం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ తెలిపారు. వేట్లపాలెం సబ్‌స్టేషన్లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేట్లపాలెం, జి.మేడపాడు, హుస్సేన్ పురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిబంధనలు పాటించాలి

ఏలేశ్వరం : వాహనదారులు రహదారి నిబంధనలను తప్పక పాటించాలని ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కాటం భాను సూచించారు. గురువారం ప్రత్తిపాడు న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి భాను మాట్లాడారు. చిన్నచిన్న తప్పుల వల్ల ప్రయణాల సమయంలో ప్రాణాలు కోల్పోవలసి వస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బైకులపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్లు ఇతర వాహనాల్లో సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.కుక్కుటేశ్వరరావు, బి.మధుబాబు, ఆర్.వెంకట్రావు, జె.రాజేష్, మాజీ అధ్యక్షుడు బుగతా శివ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూల నిర్వహణ

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా పరిధిలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొరుగు సేవలు (అవుట్‌సోర్సింగ్) విధానంలో 8 కేటగిరీలలో తొమ్మిది పోస్టుల భర్తీకి గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ అధ్యక్షతన ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పోస్టు భర్తీకి 21 మంది దరఖాస్తు చేసుకు న్నారని అన్నారు. అదే విధంగా ఒక ప్రొటెక్షన్ అధికారి పోస్ట్ భర్తీకి (ఇన్స్టిట్యూషనల్‌కేర్)గాను 35 మంది దరఖాస్తు చేసు కున్నారని ఆమె తెలిపారు. అదే విధంగా ఒక ప్రొటెక్షన్ అధికారి (నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్) పోస్టుకుగాను 34 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు అలాగే ఒక కౌన్సిలర్ పోస్టుకు 18 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెండు సోషల్ వర్కర్ పోస్టులు భర్తీకి 44 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఒక డేటా ఎనలిస్ట్ పోస్టుకు 28 మంది దరఖాస్తు చేసు కున్నారని, ఒక అసిస్టెంట్ కం డిఈఓ పోస్ట్ భర్తీకి గాను 23 దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఒక ఔట్రీచ్ వర్కర్ పోస్టు భర్తీకి 20 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో ఐసిడిఎస్ పథక సంచాలకులు ఎం.ఝాన్సీరాణి, సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ పి.సూర్య ప్రభావతి, జువైనల్ జస్టిస్ బోర్డ్ నెంబర్ తబిత, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసం చాలకులు పి జ్యోతిలక్ష్మీదేవి ఉన్నారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. గురువారం నారాయణ కళాశాల ఎదురుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ నారాయణ కళాశాల యాజమాన్యం తరగతులను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పడేలా యాజమాన్యం ప్రయత్నిస్తుందన్నారు. తక్షణమే నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మణికంఠ, సంజయ్, ఆదర్శ కార్తిక్, జయరామ్, విఫిన్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

కౌలు రైతుల రుణాలపై అవగాహన

కపిలేశ్వరపురం : టేకి రైతు సేవా కేంద్రం వద్ద గురువారం యూనియన్ బ్యాంక్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులు రుణాలు, నియమ నిబంధనలు పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కుమార్, ఎఒ రమేష్ కుమార్ మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులపై యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు రుణం మంజూరు అవుతుందన్నారు . రైతులు దూరంగా ఉన్నట్లయితే ఫోన్ ద్వారా అంగీకారం తెలపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరిబాబు, మేడిశెట్టి వెంకటరమణ ,దాసరి శ్రీనివాస్, వి.సతీష్, రైతులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులకుశంకుస్థాపన

కోటనందూరు : తుని పట్టణంలో మున్సిపల్ పార్కు అభివృద్ధికి ఎంఎల్‌ఎ యనమల దివ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కుడా సహకారంతో రూ.80 లక్షలతో మున్సిపల్ పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కులో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో పట్టణ ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ అశోక్ బాబు, యనమల రాజేష్, మోత్కూరు వెంకటేష్, చింతమనేడు అబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జ్ విసిగా మురళీకృష్ణ

కాకినాడ : కాకినాడ జవహర్లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసిగా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణను ప్రభుత్వం నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు విసిగా ఉన్న ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాద్ రాజు ఉపకులపతి పోస్టుకు రాజీనామా చేయడంతో ప్రభుత్వం ఈ మేరకు మురళీకృష్ణను ఇన్‌ఛార్జ్ విసిగా నియమించింది.

కంటిపూడి కుటుంబానికి పరిమిబాబు పరామర్శ

గండేపల్లి : గండేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కంటిపూడి రామయ్య తల్లి బంగారమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె భర్త గోవిందు, కుమారులు రామయ్య, సత్యనారాయణ, నరేంద్రలను టిడిపి నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమిబాబు గురువారం పరామర్శించారు. ఆయన వెంట సంకువల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ఆలమూరు : పార్టీలకు అతీతంగా కలసికట్టుగా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమమే, లక్ష్యంగా పనిచేయాలని పలువురు సర్పంచులు అభిప్రాయపడ్డారు. గుమ్మిలేరులో ఆ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు టి.శ్రీనివాస్, కట్టా శ్రీనివాసరావు, వై.సత్యశ్రీ మెహర్ ప్రసాద్, కె.శ్రీను పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణకు డాక్టరేట్

ముమ్మిడివరం రూరల్ : భౌతిక శాస్త్రంలో కోలా శ్రీమన్నారాయణకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు గీతం విశ్వవిద్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు డాక్టరేట్ ఆయన తెలిపారు. గేదెల్లంక గ్రామానికి చెందిన శ్రీమన్నారాయణ నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్నారు. మెటీరియల్ సైన్స్‌లో పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

30వ రోజుకు రాక్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -సామర్లకోట

అక్రమంగా తొలగించిన తమను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాక్ సిరామిక్స్ గేటు ముందు సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్స్ కార్మికులు చేపట్టిన నిరసన సోమవారం నాటికి 30వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు చంద్రశేఖర్, వరప్రసాద్, మంగారావులు మాట్లాడుతూ కార్మికులను విధుల నుంచి తొలగించి 94 రోజులైందన్నారు. పోరాటం ప్రారంభించి 30 రోజులైందన్నారు. అయినా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఐదు సార్లు జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు జరిగినా యాజమాన్యం మంకుపట్టుదలతో వ్యవహరిస్తుందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవట్లేదన్నారు. కార్మిక శాఖ మంత్రికి కూడా కంపెనీ యాజమాన్యం అబద్దాలు చెబుతుందన్నారు. ఈ ఆందోళనలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన సిమెంట్ స్తంభాలు

జగనన్న లేఔట్‌లో స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పొన్నాడ గ్రామంలో ఉన్న జగనన్న లేఔట్‌లో రోడ్డుకు అనుకుని ఉన్న రెండు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి సిమెంట్ పోల్స్ వేశారు. రానున్న రోజుల్లో తీర ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో కొంతమంది ముందస్తుగా రోడ్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. కబ్జాకు గురైన స్థలాలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పొన్నాడ గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా లే-ఔట్‌లో సిమెంట్ పోల్స్‌ను తొలగిస్తామనితెలిపారు.

తప్పుడు కేసులను ఎత్తివేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వైసిపి హయాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులన ఎత్తివేయాలని హోం మంత్రి అనితను కాకినాడ రూరల్ నియోజక వర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి కోరారు. విజయవాడలో హోం మంత్రిని వారు కలుసుకుని కాసేపు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్దేశపూర్వకంగానే వైసిపి వారు టిడిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టారన్నారు. వీలైనంత త్వరగా కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై హోం మంత్రి సానుకూలంగా స్పందించారు. కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం టిడిపి కేంద్ర కార్యాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ ఫరూక్‌ను పిల్లి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కపి సత్కరించారు. మంత్రులను కలిసిన వారిలో పెరికి సాధికార సమితి జిల్లా కన్వీనర్ కె.నరసింగరావు, టిడిపి నాయకులు కంటే సత్యనారాయణ, రూపేష్‌కుమార్ ఉన్నారు.